



ప్రత్తిపాడు మండలం లంపకలోవ ఎలిమెంటరీ పాఠశాల విద్యా కమిటీ ఎన్నికల్లో అందరూ మహిళలే ఎన్నికైన దృశ్యం



గొల్లప్రోలు మండలం చెందుర్తిలో నీట మునిగిన వరిచేలు

ముంచేసింది!

- పెరిగిన సుద్దగడ్డ వరద ఉధృతి
- ముంపులో 2 వేల ఎకరాల పంట
- జలాశయాలను తలపిస్తున్న పొలాలు
- జగనన్న కాలనీకి నిలిచిపోయిన రాకపోకలు

గొల్లప్రోలు, ఆగస్టు 8: ఎగువ ప్రాంతాలతోపాటు స్థానికంగా కురుస్తున్న భారీ వర్షాలతో సుద్దగడ్డ వరద ఉధృతి గణనీయంగా పెరిగింది. వరద నీటితో గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ (కొండ) కాలువ సమాంతరంగా ప్రవహిస్తోంది. ఏ క్షణమైనా గట్లు తెగే ప్రమాదముందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. సుద్దగడ్డ వరద ఉధృతి అధికమై గొల్లప్రోలు పట్టణ శివారులోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపై సుమారు ఆరు అడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కాలనీ వాసులు ఈ మార్గంలో వచ్చే వీలు లేకపోవడంతో పంటపొలాలు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. జగనన్న కాలనీ చుట్టూ ఉన్న పంట పొలాలు వరద ముంపులో చిక్కుకున్నాయి. సూరంపేట చుట్టూ వరద నీరు చేరింది. శివాలయ మాన్యం, అరుంధతీయ కాలనీ తదితర ప్రాంతాలకు, ఈబీసీ, ఎస్సీ కాలనీ శివారు ప్రాంతాల్లోకి వరద నీరు ప్రవహించింది. గొల్లప్రోలు-తాటిపర్తి, తాటిపర్తి -చెందుర్తి రోడ్డుపై నాలుగు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

జలాశయాలుగా పొలాలు

సుద్దగడ్డ, చౌటుకాలువతోపాటు అన్ని కాలువలకు వరద నీరు ఉధృతంగా రావడంతో పంట పొలాలు ముంపునకు గురై జలాశయాలను తలపిస్తున్నాయి. గొల్లప్రోలు పట్టణంతోపాటు చెందుర్తి, తాటిపర్తి, వన్నెపూడి, కొడవలి, చినజగ్గంపేట, లక్ష్మీపురం, చేబ్రోలు, మల్లవరం, సీతానగరం తదితర ప్రాంతాల్లో 2 వేల ఎకరాల్లో వరి, పత్తి, మిర్చి, కాయగూరలు తదితర పంటలు ముంపునకు గురయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో నాలుగు రోజులుగా వరినాట్లు, ప్రత్తి తదితర పంటలు ముంపులో ఉండడంతో పంటలు కుళ్లిపోతాయని, మళ్లీ విత్తనాలు వేసుకోవాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు.



సుద్దగడ్డ వరదతో గొల్లప్రోలు బైపాస్ రోడ్డులో జలాశయాన్ని తలపిస్తున్న పంటపొలాలు



గొల్లప్రోలు జగనన్న కాలనీ రహదారి ఇలా..



నీట మునిగిన పత్తి పంట

జగనన్న కాలనీ వాసుల రాకపోకలకు పడవల ఏర్పాటు

- తాగునీరు నిరంతరాయంగా అందజేయాలి
- కాకినాడ ఆర్డీవో కిషోర్, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి



గొల్లప్రోలులో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఆర్డీవో, జనసేన ఇన్‌చార్జి

గొల్లప్రోలు, ఆగస్టు 8: గొల్లప్రోలు పట్టణ శివారులోని జగనన్న కాలనీకి సుద్దగడ్డ వరద నీటిలో రాకపోకలు సాగించేందుకు వీలుగా పడవలు ఏర్పాటుచేయాలని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులు మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. సుద్దగడ్డ వరద ఉధృతి కారణంగా రాకపోకలు నిలిచిపోయి జగనన్న కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారు గురువారం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. కాలనీకి విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నట్టు వారి దృష్టికి వచ్చింది. అక్కడ తక్షణం లైటింగ్, విద్యుత్ సదుపాయం కల్పించాలని ఏపీఈపీడీసీఎస్ఎల్ అధికారులకు సూచించారు. అదేవిధంగా నిరంతరాయంగా కాలనీ వాసులకు తాగునీటిని సరఫరా చేయాలని చెప్పారు. రేషన్ సరుకులు కాలనీవాసుల అందరికీ అందేలా చూడాలని ఆదేశించారు. ఆర్డీవో వెంట నగర పంచాయతీ కమిషనరు రవికుమార్, ఇన్‌చార్జి తహశీల్దారు మస్తానా, విద్యుత్, మత్స్య, అగ్నిమాపక శాఖల అధికారులు ఉన్నారు.

వరి, పత్తి పంటలకు నష్టం

పర్యటించిన వ్యవసాయాధికారులు



గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 8: అధిక వర్షాలు, వరదల వల్ల పంటలకు అధిక నష్టం జరిగిందని వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణలు తెలిపారు. గొల్లప్రోలు మండలం లక్ష్మీపురం, చెందుర్తి, తాటిపర్తి తదితర గ్రామాల్లో వారు గురువారం పర్యటించి ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. పలు గ్రామాల్లో వరి, పత్తి పంటలకు ఎక్కువ నష్టం జరిగిందని ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. వీరి వెంట రైతు సేవ కేంద్రం సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో 1272 పాఠశాలలకు ఎస్ఎంసీ ఎన్నికలు పూర్తి : డీఈవో

కాకినాడరూరల్, ఆగస్టు 8: జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 2024-25 సంవత్సరానికిగానూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు (ఎస్ఎంసీ) రెవెన్యూ మండల, పోలీస్ అధికారుల సహకారంతో గురువారం ప్రశాంతంగా జరిగినట్టు డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. జిల్లాలో మొత్తం 1281 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలుండగా 1272 పాఠశాలలకు ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయన్నారు. జీరో రోల్ పాఠశాలలు 3, ఎన్నికలు వాయిదా పడిన పాఠశాలలు 3, కోర్టు కేసు ద్వారా వాయిదా పడిన పాఠశాలలు 3 ఉన్నట్టు తెలిపారు. కాగా కాకినాడ అర్బన్ పరిధిలో మొత్తం 85 పాఠశాలలుండగా, వాటిలో 81 పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా 80 పాఠశాలలు ఏకగ్రీవం కాగా ఒక పాఠశాలలో మాత్రమే పోటీ పెట్టడం జరిగిందని ఎంఈవో సీహెచ్ రవి తెలిపారు. విద్యార్థులు లేనందున ఒక పాఠశాలలో ఎన్నికలు జరగలేదని, హైకోర్టు ఆర్డరు తెచ్చుకోవడంతో 3 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించలేదన్నారు.

ఆ పాఠశాల విద్యా కమిటీలో అందరూ మహిళలే

ప్రత్తిపాడు, ఆగస్టు8: ప్రత్తిపాడు మండలం లంపకలోవ ఎలిమెంటరీ పాఠశాల విద్యాకమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు సభ్యులందరూ మహిళలే ఎన్నికయ్యారు. గురువారం ఆ పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలను నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా ఆదేశాల మేరకు ఈ విద్యా కమిటీ సమావేశంలో మహిళా సభ్యులే ఉండే విధంగా పాఠశాల తల్లిదండ్రులు ఎన్నుకున్నారు. చైర్‌పర్సన్‌గా మువ్వల గంగాభవాని, వైస్ చైర్‌పర్సన్‌గా కుక్కల దుర్గాభవానీతోపాటు మరో 13 మంది మహిళలు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహిళలతో ఎన్నికైన విద్యాకమిటీని ఎమ్మెల్యే సత్యప్రభ, స్థానిక సర్పంచ్ పి.మణికుమారి దొరబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు గొంతిన సురేష్‌లు అభినందించారు.

తాటిపర్తి విద్యా కమిటీ ఎన్నికల్లో ఉద్రిక్తత

ఇరువర్గాలు భారీగా మోహరింపు.. పోలీసుల బందోబస్తు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 8: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో జరిగిన పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు ఉద్రిక్తతలకు దారితీశాయి. ఇరువర్గాలు భారీగా మోహరించడంతో ఉత్కంఠ ఏర్పడింది. దీంతో పిఠాపురం సర్కిల్‌కు చెందిన ఎస్ఐలతో బందోబస్తు ఏర్పాటుచేశారు. తాటిపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన విద్యాకమిటీ ఎన్నికలను టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి, వైసీపీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఇరువర్గాలు పోటీకి దిగడమేకాక నాలుగు రోజులుగా విస్తృత ప్రచారం నిర్వహించి తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు రకరకాల ప్రలోభాలకు తెరలేపారు. నగదును పంపిణీ చేశారు. పాఠశాల వద్ద ఉదయం నుంచి ఇరువర్గాల మోహరించాయి. దీనితో ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనన్న ఆందోళన వ్యక్తమైంది. ఇక్కడ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేసిన దాసం వెంకటేశ్వరరావు విద్యాకమిటీ చైర్మన్‌గా, ఎస్.వీరలక్ష్మి వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కాగా విద్యా కమిటీ ఎన్నిక ఆలస్యం కావడంతో పాఠశాలకు వచ్చిన చినజగ్గంపేటకు చెందిన విద్యార్థి తల్లి గాది దుర్గ అస్వస్థతకు గురయ్యారు. కళ్లు తిరిగి పడిపోయిన ఈమెకు సహచర మహిళలు, ఉపాధ్యాయులు సపర్యలు చేశారు.

సమానంగా ఓట్లు వచ్చినా..

తాటిపర్తి ఎస్సీ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన విద్యాకమిటీ ఎన్నికల్లో ఇరువర్గాలు పోటీపడగా సమానంగా ఓట్లు వచ్చాయి. అయితే డ్రా నిర్వహించకుండా ఏకపక్షంగా ఒక వర్గం ఎన్నికయినట్టు హెచ్ఎం ప్రకటించారంటూ మరో వర్గం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో విద్యా కమిటీ ఎన్నిలకు సంబంధించి ఏవైనా వివాదాలు ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవాలని పోలీసులు సూచించారు. పాఠశాల వద్ద ఎస్ఐలు వెంకటేష్, నరసింహరావు, స్వామి తదితరులు బందోబస్తు నిర్వహించారు.



తాటిపర్తి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల వద్ద చర్చిస్తున్న పోలీసులు



సీఐ సీటు.. యమా రేటు!

కొత్త ప్రభుత్వం రాకతో పోలీసు శాఖలో బదిలీలు ఊపందుకున్నాయి. దీంతో సీఐ పోస్టింగ్‌ల కోసం ఎవరికివారు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న చోటనే తిరిగి కొనసాగేందుకు కొందరు, ఖాళీ అయ్యే అవకాశం ఉన్న స్థానాల్లోకి రావడానికి మరికొందరు సీఐలు పావులు కదుపుతున్నారు. తమను ఫలానా చోటకు పంపాలంటూ కొందరు ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. సిఫార్సు లేఖలు కోరుతున్నారు. అటు కోరిన పోస్టుకు పంపితే రూ.25 లక్షల వరకు తెరవెనుక ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. కాకినాడ వన్‌టౌన్ సీఐ పోస్టుకు ఏకంగా 14 మంది ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో ఇతర జిల్లాల సీఐలే ఎక్కువగా ఉన్నారు. టూటౌన్,త్రీటౌన్ పోస్టులకూ యమా డిమాండ్ ఉంది. అటు జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని టౌన్, పిఠాపురం, సామర్లకోట సీఐ పోస్టులకూ పోటీ భారీగా ఉంది. ఇటీవల బదిలీ అయిన సర్పవరం సీఐ విషయం ఓ మంత్రి, ఎమ్మెల్యే మధ్య చిచ్చురేపింది.

- జిల్లాలో సీఐ పోస్టింగ్‌ల కోసం పలువురు ఖాకీలు పైరవీలు షురూ
- ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల కోసం ఎడతెగని ప్రయత్నాలు
- కోరుకున్న చోటుకు రావడానికి రూ.25 లక్షలకుపైగానే ముట్టజెప్పేందుకు రెడీ
- కాకినాడ వన్‌టౌన్ సీఐ పోస్టుకు వచ్చేందుకు ఏకంగా 14 మంది పావులు
- టూటౌన్, త్రీటౌన్ పోస్టులకూ యమా డిమాండ్.. ఎమ్మెల్యే ప్రసన్నం కోసం ప్లాన్
- జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని టౌన్, పిఠాపురం, సామర్లకోట సీఐ పోస్టులకూ గిరాకీ
- ఇక్కడకు వచ్చేందుకు ఇతర జిల్లాల సీఐలు.. కొనసాగేందుకు ప్రస్తుత సీఐలూ పైరవీలు
- అటు సర్పవరం సీఐ వైఆర్‌కేను వీఆర్‌కు పంపడంతో ఓ మంత్రి, ఎమ్మెల్యే మధ్య పేచీ
- కాకినాడ డీఎస్పీ పోస్టుకు రావడానికి ఒక్కో ఎమ్మెల్యే ఒక్కో అధికారికి లేఖలు
- అయితే పోస్టింగ్ ఇచ్చే ముందు అన్నీ పూర్తి స్థాయిలో స్కానింగ్ చేస్తున్న ప్రభుత్వం
- సామర్లకోట సీఐకు పోస్టింగ్ ఇచ్చినా పాత కేసులు ఉండడంతో మళ్లీ వెనక్కు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పోలీసుశాఖలో ప్రక్షాళన చేయడం మొదలు పెట్టింది. గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రులు, పైవాళ్లు చెప్పారని నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన ఖాకీల విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. పోలీసు చట్టాలను కాదని వైసీపీ చట్టాలను అమలుచేసిన వారిని మరోమాటకు తావులేకుండా వీఆర్‌కు పంపుతోంది. వివాదాలకు, రాజకీయాలకు దూరంగా మంచి పనితీరు కనబర్చిన వారికి సముచిత స్థానాల్లో పోస్టింగ్‌లు ఇస్తోంది. అందులోభాగంగా ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల సీఐలకు స్థానచలనం కలిగించింది. ఇంకా చాలామందిని బదిలీ చేయడానికి కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో కాకినాడ వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ సీఐల బదిలీకి రంగం సిద్ధమవుతోంది. అటు జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని టౌన్, పిఠాపురం, సామర్లకోట సీఐలనూ బదిలీ చేయబోతోంది. దీంతో ఈ పోస్టుల్లోకి వచ్చేందుకు పలువురు సీఐలు పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న సీఐలు జిల్లాలో ఖాళీ కాబోతున్న సీట్లలోకి ఎలాగైనా వచ్చి చేరేందుకు పావులు కదుపుతున్నారు. ముఖ్యంగా కాకినాడ వన్‌టౌన్ సీఐ పోస్టుకోసం ఏకంగా 14మంది ప్రయత్నాలు చేస్తుండడం ఈ సీటుకు డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వన్‌టౌన్ పరిధిలో పోర్టు, బార్జీలు, బోట్లు, పలు పరిశ్రమలు ఉండడంతో లాభదాయకంగా ఈ పోస్టు ఉంటుందనే ఉద్దేశంతో పలువురు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఎమ్మెల్యేల వద్ద సిఫార్సు లేఖలకు తిరుగుతున్నారు. ఈ సీటుకోసం రూ.25లక్షలైనా ఖర్చుచేసి వచ్చేందుకు ఏలూరు, విజయవాడ, విశాఖ నుంచి పలువురు సీఐ స్థాయి అధికారులు సిద్ధపడుతుండడం విశేషం. అలాగే కాకినాడ టూటౌన్, త్రీటౌన్ సీఐ పోస్టులకు సైతం తెగ డిమాండ్ ఉంది. కొందరు స్థానిక ఎమ్మెల్యే సిఫార్సు లేఖ కోసం, మరికొందరు ఇతర జిల్లాల ఎమ్మెల్యేల లేఖలతో ఇక్కడ



ఎమ్మెల్యే వద్దకు వచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అలాగే కాకినాడ ట్రాఫిక్ విభాగం సీఐ పోస్టులకు గిరాకీ ఎక్కువగా ఉంది. జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని టౌన్, సామర్లకోట సీఐ పోస్టులకు పెద్దఎత్తున పోటీ నడుస్తోంది. ఈ స్థానాల్లోకి వచ్చేందుకు అనేక జిల్లాల నుంచి కొందరు సీఐలు తమ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. అటు తమ స్థానాల్లో కొనసాగుతున్న సీఐలు తమను ఈసారికి కదల్చకుండా చూడాలంటూ స్థానిక ఎమ్మెల్యేల వద్ద పైరవీలు చేస్తున్నారు. కొందరైతే సిఫార్సు లేఖలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ కొనసాగుతున్న కొందరు సీఐలు గత వైసీపీ ప్రభుత్వ పెద్దల ద్వారా వచ్చిన వారే. దీంతో తమ సీటుకు ఎసరు పడుతుందనే భయంతో పైరవీలు చేసుకుంటున్నారు. దీంతో ఒక్కో సీటుకు ఆ ప్రాంతం బట్టి రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు తెరచాటు బేరాలు నడుస్తున్నాయి. వాస్తవానికి ఇటీవల సర్పవరం, కాకినాడ రూరల్ స్థానాల్లో కొత్త సీఐలు వచ్చి చేరారు. ఇందులో కొందరు తెరవెనుక ప్రయత్నాలు ఫలించడంతో కోరుకున్న స్థానాలు దక్కాయి. వీరి స్ఫూర్తితో మరి కొందరు తమ ప్రయత్నాలకు మరింత పదును పెట్టారు.

డీఎస్పీగా ఎవరొస్తారో...

సర్పవరం సీఐగా పనిచేసిన వైఆర్‌కే శ్రీనివాస్‌ను ఇటీవల ప్రభుత్వం వీఆర్‌కు పంపింది. అయితే ఈయన గతంలో అమలాపురంలో పనిచేసినప్పుడు తనను ఇబ్బంది పెట్టారన్న కారణంతో ప్రస్తుతం ఓ మంత్రి చక్రం తిప్పి ఆయన్ను వీఆర్‌కు పంపేలా చేశారు. అయితే ఇదికాస్తా జిల్లాలో ఓ ఎమ్మెల్యేకు తీవ్ర ఆగ్రహం రప్పించింది. తనది కాని జిల్లాలో ఆ మంత్రి ఎలా వేలు పెడతారంటూ సదరు ఎమ్మెల్యే ఆగ్రహంగా ఉన్నారు. అటు వీఆర్‌కు పంపిన ఆ సీఐను ఎలాగైనా తన నియోజకవర్గంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోపక్క కాకినాడ డీఎస్పీగా పనిచేసిన హనుమంతరావును ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసింది. దీంతో కొత్త డీఎస్పీ ఎవరొస్తారనేది ఆసక్తిగా మారింది. జిల్లా కేంద్రంగా పనిచేసే డీఎస్పీ పాత్ర చాలా కీలకం కాబట్టి ఆచితూచి సదరు అధికారిని నియమించాలని ప్రభుత్వం చూస్తోంది. అయితే ఈ పోస్టుకు అమలాపురం, విశాఖ ఏసీబీలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు విపరీతంగా ప్రయత్నిస్తున్నారు. జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలైతే వీరిలో ఒకరికి సిఫార్సు లేఖ కూడా ఇచ్చేశారు. అయితే ఈ స్థానానికి అనంతపురం నుంచి ఓ అధికారిని తీసుకురావాలని పవన్ భావిస్తున్న తెలుస్తోంది. ప్రధానంగా సామాజిక వర్గ ప్రాధాన్యతను పక్కనపెట్టి పనితీరు ప్రాతిపదికన అక్కడి నుంచి తీసుకురావాలని భావిస్తున్నారు. కానీ ఈ లోపు పలువురు విపరీతంగా ఇక్కడకు వచ్చేందుకు తెగ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం సీఐల నుంచి డీఎస్పీల వరకు పోస్టింగ్ ఇచ్చేముందే ఒకటికి పదిసార్లు క్షుణ్ణంగా వారి గత పనితీరును పరిగణనలోకి తీసుకుని పోస్టింగ్‌లు ఇవ్వాలని భావిస్తోంది. అందులోభాగంగానే సామర్లకోట సీఐ అంకబాబుకు పోస్టింగ్ ఇచ్చిన వారంలోపే ఆయనపై గంజాయి కేసు ఉందని తేలడంతో బుధవారం ఆయన పోస్టింగ్ ఆర్డరును రద్దుచేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించి పోస్టింగ్‌లు ఇస్తుండడంతో పోస్టుల కోసం పైరవీలు చేసే వారిలో గుబులు మొదలైంది.





శాసనసభ స్పీకర్‌ను కలిసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు8: రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుని గురువారం కాకినాడ రూరల్ కేఎస్పీఎల్ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌లు కలిశారు.

లక్ష్యానికి అనుగుణంగా వ్యవసాయశాఖల ప్రణాళికలు : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 8: రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ప్రణాళిక ప్రకారం పనిచేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం వ్యవసాయ అనుబంధ విభాగాలైన వ్యవసాయం, పశుసంవర్థక, మత్స్య, సహకార, మార్కెటింగ్, లీడ్‌బ్యాంకు, అటవీశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో పురోగతి కనబర్చే విధంగా అధికారులు ప్రణాళికలు అమలు చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 50,500 కౌలురైతు కార్డులు పంపిణీ చేశామన్నారు. వీటిని నూరుశాతం పంపిణీ చేసి కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుచేసి పశువుల షెడ్ల నిర్మాణం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో త్రినాథ్, వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్, పశు సంవర్థకశాఖ జేడీ సూర్యప్రకాశరావు, జిల్లా మత్స్యశాఖాధికారి కరుణాకర్, మార్కెటింగ్ ఏడీ దుర్గాప్రసాద్, లీడ్‌బ్యాంకు మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

జ్యోతిర్మయి వ్రతాల నిర్వహణకు అనుమతి రద్దు

అన్నవరం, ఆగస్టు 8: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గతేడాది కార్తీక మాసంలో జ్యోతిర్మయి వ్రతాలకు అప్పట్లో దేవదాయ కమిషనర్ అనుమతులిచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ తాజాగా ఆదేశాలు వెలువడ్డాయి. ఒక్కో టిక్కెట్టు రూ. 10,116గా నిర్ణయించి సుమారు 4 గంటల పాటు వ్రతం చేపట్టాల్సి ఉంది. అయితే దీనిపై పునఃపరిశీలన చేసి ఈ క్రతువు వ్యయప్రయాసలతో కూడుకున్నదని భక్తుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో దేవదాయ కమిషనర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్రతాలు నిర్వహించే మండపం కోసం అప్పట్లో ఖర్చు చేసిన సుమారు రూ.15 లక్షల వ్యయం బూడిదలో పోసిన పన్నీరైందని భక్తులు ఆవేదన చెందుతున్నారు. ముందుచూపు లేకుండా తీసుకునే నిర్ణయాలతో దేవస్థానం ఖజానాకు నష్టం చేకూరుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సత్యదేవునికి మెడికల్-హెల్త్ చీఫ్ సెక్రటరీ పూజలు

అన్నవరం, ఆగస్టు 8: రత్నగిరివాసుడైన సత్యదేవుని ఏపీ మెడికల్-హెల్త్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేయగా పీఆర్వో కృష్ణారావు స్వామివారి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి.రవికుమార్ పాల్గొన్నారు.



ధగధగాయమానం

సత్యదేవుడి ధ్వజస్తంభానికి స్వర్ణతాపడం పూర్తి

నేడు ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు ప్రదక్షిణకు అనుమతి

అన్నవరం, ఆగస్టు 8: రత్నగిరివాసుడైన సత్యదేవుడి ధ్వజస్తంభ స్వర్ణతాపడం అమరిక పనులను గురువారం ఉదయం ప్రారంభించారు. నెల్లూరుకు చెందిన దాత రూ.3కోట్ల వ్యయంతో చేయించేందుకు ముందుకొచ్చారు. ఏప్రిల్ 22న నార్వేప కర్రతో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరిగింది. అప్పటి నుంచీ దీనికి సంబంధించి రాగి రేకు, దానిపై బంగారు పూత పనులు చేపట్టారు. 300 కిలోల రాగి రేకుపై రెండు కిలోల బంగారంతో స్వర్ణ తాపడం చేయించారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు పండితులు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు చేస్తారు. 10.20 గంటల నుంచి భక్తులకు బంగారు ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణ చేసేందుకు అనుమతి ఇస్తారు. కార్యక్రమంలో దాత దంపతులు, ఇన్‌చార్జి ఈవో రమేష్‌బాబు పాల్గొంటారు.







ఆదివాసీల సంక్షేమం

ఎండమావేనా!

ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పు తద్వారా సంపన్న శ్రేణి మినహాయింపు ఆయా జాతుల అభివృద్ధి, సంక్షేమాలకు సూచికలు కాగలవేమో కానీ ఆదివాసీల మనుగడకు అవసరమైన హక్కులు, సాధికారతను కల్పించలేకపోతోంది. ఆదివాసీల అభివృద్ధికి, సంక్షేమానికి బ్రిటిష్ కాలం నుంచీ ఎన్ని ప్రణాళికలు, శాసనాలు అమలవుతున్నా వారి జీవన ప్రమాణాలను పెంచాల్సిన ప్రభుత్వ పాలకులు, అధికారులే వారి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న వనరులపై వారికి సంపూర్ణ హక్కులు వారి మనుగడకు, వికాసానికి దోహదపడట్లేదు. ఒక్కోమారు వారికి ఉన్న హక్కులను ప్రభుత్వాలను నడిపించే పాలకులే హరించేస్తున్నారు. అభివృద్ధి ముసుగులో కొన్ని విధానాలు ఆదివాసీల ఉనికినే లేకుండా చేస్తున్నాయి. సంస్కృతీ, సంప్రదాయాలకు తిలోదకాలనిస్తున్నారు. ప్రాజెక్టుల పేరుతో ఆదివాసీల ఐక్యతను దెబ్బతీస్తూ, జాతి అంతానికే దారితీసే నిర్ణయాలను ప్రభుత్వాలు తీసుకుంటున్నాయి. ఆదివాసీ మహిళలకు కనీస ఆస్తి హక్కు కూడా గత 77 సంవత్సరాలుగా కలగలేదు. పాలకులు ఎవరు మారినా అధికార యంత్రాంగం తీరులో మార్పు లేకపోవడంతో ఆదివాసీ సంక్షేమం ఎండమావిగానే ఉంది

వారి మనుగడకు వర్గీకరణకు మించిన సాధికారత కావాలి

హక్కుల రక్షణను విస్మరించిన పాలకులతో తిరోగమనంలో జీవనం

(రంపచోడవరం)

ఆదివాసీల జీవన ప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయి. ఎటువంటి మౌలిక సదుపాయాలు లేని కాలంలో ఎంతో ఆదర్శప్రాయమైన జీవనాన్ని సాగించిన గిరిజన జాతులు నేడు ఎన్నో, సామాజిక, ఆర్థిక, రాజకీయ ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. అడవిని నమ్ముకుని జీవనం సాగించే వీరికి నేటికీ అటవీ హక్కులు పూర్తిస్థాయిలో దక్కలేదు. కానీ ఆదివాసీలకు చెందాల్సిన వనరులను వారి ప్రమేయం లేకుండా అమ్ముకుని, ఖనిజాలు దోచేసే వ్యవస్థలకు ప్రోత్సాహం ఎక్కువైంది. విధాన లోపం, అమలు చేసేవారిలో చిత్తశుద్ధి లోపం గిరిజనులకు శాపంగా మారింది. ఇక్కడి వనరుల ఆధారంగా జరిగే వాణిజ్య వ్యవహారాల్లో ఆదివాసీలను భాగస్వాములుగా చేసి వారికి కూడా ఆర్థికాభివృద్ధి సాధించిపెట్టే వ్యూహాలు అమలుకు నోచుకోవట్లేదు. ఆహార, ఆరోగ్య భద్రతలు మృగ్యమయ్యాయి. ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే సుమారు 420 ఆవాసాలకు సకాలంలో అత్యవసర వైద్య సేవలు పొందే అవకాశం లేదు. సుమారు 502 ఆవాసాలకు సరైన రహదారి బంధాలు లేవు. ఈ జిల్లాలో మూడు ఐటీడీఏలు ఏర్పాటు చేసిన లక్ష్యం నీరుగారి నిర్దేశించిన ఆశయాల్లో గత 48 సంవత్సరాలుగా ఏ ఒక్కదానినీ అవి సాధించకపోగా అవినీతికి నిలయాలుగా మారాయి. గిరిజనుల పేరుతో చేపట్టాల్సిన పథకాలను, కార్యక్రమాలను అధికారులు, రాజకీయ నాయకులు తమ జేబులు నింపుకునే కార్యక్రమాలుగా మార్చారు. ఎన్ని విచారణలు జరిగి, ప్రభుత్వానికి ఎన్ని నివేదికలు అందినా బాధ్యులపై చర్యలు మృగ్యమే! దీంతో గిరిజన ప్రాంతం అవినీతిపరులకు అడ్డాగా మారింది. గిరిజనాభివృద్ధిని నిర్దేశించే సమావేశాలు మూడేళ్లుగా ఐటీడీఏల్లో జరగడం లేదు. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో రాజకీయ చైతన్యం అంతగా లేకపోవడంతో బ్యూరోక్రాట్లే పెత్తనం సాగిస్తూ గిరిజన మనుగడను దెబ్బతీస్తున్నారు. గిరిజనులను భాగస్వామ్యం చేసి ప్రణాళికలను రూపొందించాలన్న అంశాన్నే విస్మరించారు. ఐటీడీఏలో మెజారిటీ సభ్యులందరూ అధికారులే కావడం విశేషం. జవాబుదారీతనం కలిగిన వ్యవస్థగా గిరిజనుడే ఛైర్మన్‌గా, పెద్ద సంఖ్యలో గిరిజనులే సభ్యులుగా ఐటీడీఏను రూపొందించం ద్వారా గిరిజనుల్లో నాయకత్వ లక్షణాలు పెరిగి ఈ ప్రాంత ప్రయోజనాల రక్షణకు వీలుంటుంది.

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

జలాలను సద్వినియోగపర్చే దిశగా సాగాల్సిన జలయజ్ఞాలు ధనయజ్ఞాలుగా మారి గిరిజన ప్రయోజనాలను దెబ్బతీసిన పరిస్థితులు అందరికీ తెలిసినవే! ఇక పోలవరం లాంటి మెగా ప్రాజెక్టు విషయంలో గత రెండు దశాబ్దాలుగా సరైన పునరావాస విధానాన్ని ప్రభుత్వాలు చేపట్టకపోవడంతో ఒక్క అల్లూరి జిల్లాలోనే సుమారు 236 ఆవాసాల గిరిజనుల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఈ పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాలలో ఆదివాసీలకు ఉన్న అటవీ హక్కులను పరిరక్షించాలని కేంద్రం గతంలోనే ఆదేశించినా ఇప్పటికీ అటవీ హక్కులు వారికి దక్కలేదు. ప్రాజెక్టు కారణంగా ఆదిమజాతిలో ముఖ్యమైన కొండరెడ్లు అధికంగా ఉండే గోదావరి తీర గ్రామాల నుంచి వారిని తొలగించేందుకు రంగం సిద్ధమైంది.

ఇక ఆదివాసీలు సాధికారత సాధించే దిశగా తీసుకుంటున్న చర్యలే ఎక్కడా కనిపించట్లేదు. 73వ రాజ్యాంగ సవరణలోని అంశాలకు ఈ ప్రాంతంలోని అధికారులు విలువ ఇవ్వట్లేదు. అధికారులు తీసుకునే ఏ నిర్ణయం కూడా పీసా చట్టం కింద సాగడం లేదు. గిరిజన మహిళలకు సమాన ఆస్తి హక్కు కల్పించే దిశగా కూడా ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేదు. దీంతో గిరిజన కుటుంబాల మధ్య ఆస్తి హక్కుల విషయాల్లో అనేక వివాదాలు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులోనైనా ప్రభుత్వాలు గిరిజన సాధికారిత కోసం చర్యలు తీసుకుని, వారి మనుగడ కోసం కృషి చేస్తాయేమో చూడాలి.



హైవేపై బోల్తాపడిన ట్రావెల్స్ బస్సు

అర్ధరాత్రి హాహాకారాలు

దివాన్‌చెరువు హైవేపై అదుపుతప్పిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ప్రయాణికులు సురక్షితం

రాజమహేంద్రవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు హైవేపై దూసుకుపోతోంది.. సరిగ్గా అర్ధరాత్రి 1.30 సమయం.. వర్షం కురుస్తోంది.. దాదాపుగా అందరూ గాఢ నిద్రలో ఉన్నారు.. ఈలోపు పెద్ద కుదుపు.. బస్సు అదుపు తప్పింది.. ప్రయాణికుల హాహాకారాలు.. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కేవీఆర్ ట్రావెల్స్‌కి చెందిన బస్సు గుంటూరు నుంచి పాలకొండ వెళ్తోంది. వర్షం పడుతుండడంతో రోడ్డు చిత్తడిగా మారింది. దివాన్‌చెరువు సమీపంలో హైవేపైకి చేరే మలుపు వద్ద బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు తుప్పల్లోకి వెళ్లింది. డ్రైవరు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న సౌత్‌జోన్ డీఎస్పీ అంబికాప్రసాద్, ధవళేశ్వరం సీఐ వి.వినయ్‌మోహన్, ప్రకాశ్‌నగర్ ఎస్ఐ శివప్రసాద్, రోడ్ సేఫ్టీ మొబైల్ సిబ్బంది ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. కేవీఆర్ ట్రావెల్స్ స్థానిక కార్యాలయం నుంచి కూడా సిబ్బంది వచ్చారు. 40మంది ప్రయాణికులను జాగ్రత్తగా కిందికి దింపి వేరే బస్సులో పంపించారు.

విజిలెన్స్ దాడుల్లో 33.27 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

పిఠాపురం, ఆగస్టు 8: కాకినాడ పిఠాపురంలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని బొజ్జావారితోట ఏరియాలో పాడుబడి వినియోగంలో లేని ఇంటిలో రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు అందిన సమాచారంతో తనిఖీలు చేపట్టారు. అక్కడ 65 బస్తాల్లో ఉన్న 33.27 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఊటా బుల్లిరాజుపై పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. పట్టుబడిన రేషన్ బియ్యం విలువ రూ.1.54లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ టి.జగన్నాథరెడ్డి, ఏవో జి.భార్గవమహేష్, డీసీటీవో నవీన్‌కుమార్, వీసీలు జీవీఎస్ లోవరాజు, కె.వీరబాబు, సివిల్ సప్లయిస్ డీటీ వీరాస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రేషన్‌బియ్యం క్రయ, విక్రయాలు జరిపినా, అక్రమంగా నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పిఠాపురంలో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

శతాధిక వృద్ధుడి మృతి



పెరవలి, ఆగస్టు 8: తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులమర్రు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు ఉప్పలపాటి సుబ్బారావు (102) గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య రామలక్ష్మి, ఒక కుమారుడు సత్తిరాజు, నలుగురు కుమార్తెలు, 11 మంది మనుమలు, 18 మంది మునిమనుమలు ఉన్నారు. గ్రామానికి మంచినీటి సౌకర్యం లేని రోజుల్లో సుబ్బారావు చెరువును తవ్వించడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారని గ్రామస్తులు తెలిపారు. ఆయన మృతికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు, టీడీపీ, జనసేన నాయకులు సంతాపం తెలిపారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దుపై ప్రయాణికుల అసహనం

సామర్లకోట, ఆగస్టు 8: విశాఖ-తిరుపతి మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్టు రైల్వే అధికారులు అర్ధంతరంగా ప్రకటించడంతో సాధారణ ప్రయాణికులతో పాటు తిరుపతి వెళ్లేందుకు ముందుగా రిజర్వేషన్ చేయించుకున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రిజర్వేషన్ టిక్కెట్లకు సొమ్ము రిఫండ్ పొందేందుకు సరియైన సమాచారం చెప్పే రైల్వే అధికారులు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని సామర్లకోట రైల్వే ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లగా రిజర్వేషన్ టిక్కెట్లకు సంబంధించిన సొమ్మును వెనక్కి ఇస్తామని చెప్పారు.

గంజాయి సమాచారం ఇస్తే రూ.5వేలు రివార్డు

మంత్రి సుభాష్ ప్రకటన

రామచంద్రపురం (ద్రాక్షారామ), ఆగస్టు 8: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా గంజాయి సరఫరా, వినియోగించే వారి సమాచారం ఇస్తే వారికి రూ.5వేలు ఇస్తామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటించారు. పరిశ్రమలు, కళాశాలలు, పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో గంజాయి అమ్మేవారు, తాగేవారి వివరాలను తనకు గానీ, పోలీసులకు గానీ తెలియజేసే వారికి నగదు రివార్డు ఇస్తామన్నారు. సమాచారం ఇచ్చిన లేదా పట్టిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు అందరూ సహకరించాలని మంత్రి కోరారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

మలికిపురం, ఆగస్టు 8: గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న అప్పనరామునిలంకకు చెందిన మిరియాల బన్నును గురువారం మలికిపురం మసీదు రోడ్డులో అరెస్టు చేసి కోర్టుకు పంపినట్టు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. ఎవరైనా గంజాయి తాగినా, అమ్మినా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



గుర్తు తెలియని జంతువు దాడిలో మృతి చెందిన దూడ, జంతువు పాదముద్రలు

గుర్తు తెలియని జంతువు దాడిలో లేగదూడ మృతి

గండేపల్లి, ఆగస్టు 8: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన వల్లభశెట్టి సత్తిబాబుకి ఎన్టీ రాజాపురం సమీపంలో దూళ్ల సావిడి వుంది. అతడు గురువారం ఉదయాన్నే పాలు తీసుకుని తిరిగి వచ్చేసరికి చనిపోయి సగం తినేసి ఉన్న దూడను చూసి భయపడ్డాడు. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలపగా ఫారెస్టు ఆఫీసరు పాలకు శశికుమార్ వచ్చి పాదముద్రలు గుర్తించారు. వీటిని ఉన్నతాధికారులకు పంపిస్తామని, ఏ జంతువో చెప్పలేమన్నారు. రేసు కుక్కలు లేదా చిరుత అయి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదే ప్రాంతంలో కొంతకాలం క్రితం మల్లేపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి బుల్లబ్బాయి లేగదూడను గుర్తు తెలియని జంతువు ఇదే మాదిరిగా తినేయడంతో పాటు ఒక గేదెపై దాడి చేసిన సంఘటనలున్నాయి. అప్పట్లో అటవీ శాఖాధికారులు అందుకు కారణం రేసు కుక్కలు అయి ఉండవచ్చని భావించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. తాజాగా జరిగిన ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.46/బి, రాజమహేంద్రవరం

ఎన్నికల మహాజన సభ నోటీసు

(ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల నియమావళి 1964లోని నియమము-22(3)(ఎ) ప్రకారము)

ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నెం.46/బి, రాజమహేంద్రవరం యొక్క నూతన పాలకవర్గ సభ్యుల ఎన్నిక జరుపవలసియున్నది. ఈ ఎన్నికల ప్రక్రియ కొరకు ది.25-8-2024 ఆదివారం ఉదయం 8 గం॥ నుండి సాయంత్రం 4గం॥ల వరకు లోకల్ **నియోజకవర్గము(1)కు** సంబంధించిన బ్రాంచీలు అనగా 1. జాంపేట మెయిన్ బ్రాంచ్ 2. మోరంపూడి 3. ధవళేశ్వరం మరియు 4. సీతంపేట బ్రాంచీలకు సంబంధించి ఎన్నిక మహాజన సభ 1. ఎస్.కె.వి.టి ఇంగ్లీషు మీడియం హైస్కూల్, దానవాయిపేట, రాజమహేంద్రవరం 2. ఎస్.కె.వి.టి. డిగ్రీ కళాశా (వై.జంక్షన్), రాజమహేంద్రవరం 3. చున్నీలాల్ జాజూ రోటరీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ కంబాలపేట, వై.జంక్షన్ దగ్గర రాజమహేంద్రవరం 4. జాంపేట బాలికల మున్సిపల్ కార్పొరేషన్ ఎలిమెంటరీ స్కూల్, జాంపేట, జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ప్రక్కన్న రాజమహేంద్రవరం (జాంపేట మెయిన్ బ్రాంచి సభ్యులకు) 5. దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్ దానవాయిపేట, రాజమహేంద్రవరం (మోరంపూడి బ్రాంచి సభ్యులకు) 6. ధవళేశ్వరం జెడ్.పి.పి.బాలికల హైస్కూల్, ధవళేశ్వరం (ధవళేశ్వరం బ్రాంచి సభ్యులకు) 7. సి.జి.టి.యం.ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లలితానగర్ రాజమహేంద్రవరం (సీతంపేట బ్రాంచి సభ్యులకు)ల నందు జరుపుటకు మరియు **నాన్‌లోకల్ నియోజకవర్గము(2)కు** సంబంధించిన బ్రాంచీలు అనగా అనపర్తి, గోకవరం, మరియు **నాన్ లోకల్ నియోజకవర్గం (3)కు** సంబంధించిన బ్రాంచీలు పెద్దాపురం, కాకినాడ లకు సదరు బ్రాంచ్ ఆవరణలలో మరియు ఏలూరు, కొవ్వూరు బ్రాంచి సభ్యులకు ఏలూరు బ్రాంచి నందు ఎన్నికల మహాజన సభ జరుపుటకు నిర్ణయించడమైనది. కావున ఓటు హక్కు కలిగిన యావన్మంది సభ్యులు తమ పాలకవర్గ సభ్యులను ఎన్నుకొను నిమిత్తం ఎన్నికల మహాజన సభకు హాజరు కావలసినదిగా కోరడమైనది. సదరు ఎన్నికల మహాజన సభకు హాజరగు సభ్యులు బ్యాంకు వారిచే ఇవ్వబడిన తమ ఫొటో గుర్తింపు కార్డుతో హాజరు కావలసినదిగా కోరడమైనది.

సం/- **యం.జగన్నాధ రెడ్డి**, డివిజనల్ కోపరేటివ్ ఆఫీసర్, రాజమహేంద్రవరం మరియు ఎన్నికల అధికారి
డి.జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.46/బి, రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం, తేది.09.08.2024

ఎన్నికల ప్రకటన

ది.జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.46/బి, రాజమహేంద్రవరం

ఫారము-1

తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం అర్బన్ మండలంలోని ది.జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.46/బి, రాజమహేంద్రవరం యొక్క పాలకవర్గమునకు ది.25-08-2024 తేదీ ఆదివారం ఎన్నికలు నిర్వహించుటకు జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధారిటీ తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం వారు నన్ను ఎన్నికల అధికారిగా నియమించినారు.

ఎన్నికల కార్యక్రమము ఈ క్రింది విధంగా ఉంటుంది.

1) బ్యాంకు పేరు, రిజిస్టర్ నెం : ది. జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.46/బి, రాజమహేంద్రవరం
2) ఎన్నికల విధానం : రహస్య బ్యాలెట్
3) మొత్తము ఎన్నికలు జరుగు స్థానములు మరియు ఎస్.సి/ ఎస్.టి./బి.వి/ మరియు స్త్రీలు/ ఇతరులకు కేటాయింపు ఏమైనా ఉన్నచో : 12 (పన్నెండు) ఎట్టి రిజర్వేషన్లు లేవు
4) నియోజకవర్గముల సంఖ్య : 3

నియోజకవర్గము -1 (లోకల్)

బ్రాంచి పేర్లు	ఓటర్ల జాబిత క్రమ సంఖ్య		ఓటర్ల అడ్మిన్ నెం.		ఎన్నికలు జరుగు స్థానములు
	నుండి	వరకు	నుండి	వరకు	
1. జాంపేట మెయిన్ బ్రాంచి	1	15623	3	32137	10 (పది)
2. మోరంపూడి బ్రాంచి	15624	17765	4153	32135	
3. ధవళేశ్వరం బ్రాంచి	17766	20986	14687	32139	
4. సీతంపేట బ్రాంచి	20987	23752	4561	32122	

నియోజకవర్గము -2 (నాన్ లోకల్)

బ్రాంచి పేర్లు	ఓటర్ల జాబిత క్రమ సంఖ్య		ఓటర్ల అడ్మిన్ నెం.		ఎన్నికలు జరుగు స్థానములు
	నుండి	వరకు	నుండి	వరకు	
1. అనపర్తి బ్రాంచి	1	963	19639	32132	1 (ఒకటి)
2. గోకవరం బ్రాంచి	964	1901	21564	32089	

నియోజకవర్గము -3 (నాన్ లోకల్)

బ్రాంచి పేర్లు	ఓటర్ల జాబిత క్రమ సంఖ్య		ఓటర్ల అడ్మిన్ నెం.		ఎన్నికలు జరుగు స్థానములు
	నుండి	వరకు	నుండి	వరకు	
1. పెద్దాపురం బ్రాంచి	1	757	20000	32004	1 (ఒకటి)
2. కాకినాడ బ్రాంచి	758	1591	21176	32046	
3. ఏలూరు బ్రాంచి	1592	2064	22814	32044	
4. కోవ్వూరు బ్రాంచి	2065	2071	31844	32105	

5) పోలింగ్ జరుగు తేది, సమయము మరియు ప్రదేశము (పోటీ అనివార్యమైనపుడు) : ది 25-08-2024 ఆదివారం ఉదయం 8 గం॥ల నుండి సాయంత్రం 4 గం॥ల వరకు

నియోజకవర్గము -1 (లోకల్)

బ్రాంచి పేర్లు	ఎన్నికలు జరుగు స్థలము
1. జాంపేట మెయిన్ బ్రాంచి	1. ఎస్.కె.వి.టి. ఇంగ్లీషు మీడియం హైస్కూల్, దానవాయిపేట, రాజమహేంద్రవరం. 2. ఎస్.కె.వి.టి. డిగ్రీ కళాశాల (వై. జంక్షన్) రాజమహేంద్రవరం. 3. చున్నీలాల్ జాజూ రోటరీ మున్సిపల్ కార్పోరేషన్ హైస్కూల్, కంబాలపేట, రాజమహేంద్రవరం. 4. జాంపేట బాలికల మున్సిపల్ కార్పోరేషన్ ఎలిమెంటరీ స్కూల్ జాంపేట, రాజమహేంద్రవరం.
2. మోరంపూడి బ్రాంచి	దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్ దానవాయిపేట, రాజమహేంద్రవరం.
3. ధవళేశ్వరం బ్రాంచి	జెడ్.పి.పి బాలికల హైస్కూల్, ధవళేశ్వరం.
4. సీతంపేట బ్రాంచి	సి.జి.టి.యం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లలితా నగర్ రాజమహేంద్రవరం.

నియోజకవర్గము -2 (నాన్ లోకల్)

బ్రాంచి పేర్లు	ఎన్నికలు జరుగు స్థలము
1. అనపర్తి బ్రాంచి	ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., అనపర్తి డోర్ నెం: 6-276, పంచాయితీ ఆఫీసు ప్రక్కన, శేషగిరిరావు పేట, అనపర్తి.
2. గోకవరం బ్రాంచి	ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., గోకవరం డోర్ నెం: 8-86, లారీ ఓనర్స్ అసోసియేషన్ బిల్డింగ్, మెయిన్ రోడ్డు, గోకవరం.

నియోజకవర్గము -3 (నాన్ లోకల్)

బ్రాంచి పేర్లు	ఎన్నికలు జరుగు స్థలము
1. పెద్దాపురం బ్రాంచి	ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., పెద్దాపురం డోర్ నెం: 16-12-49, పాత గవర్నమెంట్ హాస్పటల్ వీధి, పెద్దాపురం.
2. కాకినాడ బ్రాంచి	ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., కాకినాడ డోర్ నెం: 70-3-2, ఆర్టీసీ కాలనీ రోడ్డు, రమణయ్యపేట, సర్పవరం జంక్షన్, కాకినాడ.
3. ఏలూరు బ్రాంచి మరియు కొవ్వూరు బ్రాంచి	ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., ఏలూరు డోర్ నెం: 23ఎ-9-10, శంకరమఠం వీధి, ఆర్.ఆర్.పేట, ఏలూరు.

6. నామినేషన్లు స్వీకరణ తేది, సమయం ప్రదేశము (షె.కులము రూ 200/-, షె తెగలు రూ.200/- వెనుకబడిన తరగతులు రూ. 400/- ఇతరులు రూ 1000/- నామినేషన్ రుసుముగా చెల్లించాలి) : ది.16-08-2024 శుక్రవారం ఉ.11గం.ల నుండి సా.5 గం.ల వరకు బ్యాంక్ ప్రధాన కార్యాలయం ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్, రాజమహేంద్రవరం, జాంపేట
7. నామినేషన్ల పరిశీలన తేది సమయము మరియు ప్రదేశము : ది.17-08-2024 శనివారం ఉ.11గం.ల నుండి సా॥ 5గం॥లకు బ్యాంకు ప్రధాన కార్యాలయం, ది.జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి, రాజమహేంద్రవరం, జాంపేట
8. నామినేషన్ల ఉపసంహరణ తేది సమయము మరియు ప్రదేశము : ది.18-08-2024 ఆదివారం ఉ.11 గం.ల నుండి సా.5 గం. వరకు బ్యాంకు ప్రధాన కార్యాలయం, ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి, రాజమహేంద్రవరం, జాంపేట.
9. పోటీ దారులకు గుర్తుల కేటాయింపు : ది.18.08.2024 ఆదివారం సా.5గం॥ల తరువాత బ్యాంక్ ప్రధాన కార్యాలయం ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి., రాజమహేంద్రవరం, జాంపేట
10. ఎన్నికలు జరుగు తేది : ది.25.08.2024 ఆదివారం ఉదయం 8గం.ల నుండి సాయంత్రం 4 గం.లకు వరకు
11. ఓట్ల లెక్కింపు జరుగు తేది సమయము మరియు ప్రదేశము : ది.26-8-2024 సోమవారం ఉ.8 గం.ల నుండి ఎస్.కె.వి.టి.డిగ్రీ కళాశాల (వై.జంక్షన్), రాజమహేంద్రవరం
12. ఎన్నికల ఫలితములను ప్రకటించు తేది, సమయము మరియు ప్రదేశము : ది.26-08-2024 సోమవారం కౌంటింగ్ పూర్తయిన పిదప, ఎస్.కె.వి.టి.డిగ్రీ కళాశాల (వై.జంక్షన్) రాజమహేంద్రవరం
13. ఆఫీస్ బేరర్ల ఎన్నిక, పాలక మండలిలో భర్తీ కాని స్థానములను మరియు ఖాళీలగు స్థానములను కో-ఆప్షన్ ద్వారా భర్తీ చేయుట : ది.27-08-2024 మంగళవారం ఉ.8గం.ల నుండి ప్రధాన కార్యాలయం, ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన బ్యాంక్ లి., రాజమహేంద్రవరం, జాంపేట.

గమనిక:

i) నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికయినచో ది.18-08-2024 సాయంత్రం 5గం.ల తరువాత ఫలితాలు ప్రకటించబడును మరియు ఆఫీసు బేరర్ల ఎన్నిక ది.19-08-2024వ తేదీన ఉదయం 8 గం.ల నుండి ప్రధాన కార్యాలయం నందు జరుపబడును.
ii) బ్యాంక్ సభ్యులు బ్యాంకు యొక్క బ్రాంచిల నందు గల నోటీసు బోర్డులో ఉంచబడిన ఓటింగ్‌కు అర్హత గల సభ్యుల జాబితాను పరిశీలించు కోవచ్చును.

సం/- **యం.జగన్నాథరెడ్డి**
డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్,
రాజమహేంద్రవరం మరియు ఎన్నికల అధికారి
ది.జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నెం.46/బి, రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం
తేది.09-08-2024

ప్రశాంతంగా ఎస్ఎంసీ కమిటీ ఎన్నికలు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 8: కాకినాడ రూరల్ మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈవో వేణుగోపాల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్కూల్ మేనేజిమెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో మొత్తం 77 మండల పరిషత్తు, హైస్కూళ్లు ఉండగా ఇందులో 30 స్కూల్స్‌కి ఎస్ఎంసీ కమిటీ సభ్యులను విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు. 47 స్కూల్స్ కమిటీలకు ఎన్నికలు జరిగినట్లు తెలిపారు. ఇంద్రపాలెంలో నిర్వహించిన పేరెంట్స్ మేనేజిమెంట్ కమిటీ ఎన్నిక నిర్వహణపై కొంత గందరగోళం జరిగింది.

సామర్లకోటలో..

సామర్లకోట, ఆగస్టు 8: పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు గురువారం సామర్లకోట మండలం, పట్టణంల్లోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల్లో ప్రశాంత వాతావరణంలో కమిటీల ఎన్నికలు నిర్వహించారు. సామర్లకోట మండలం, పట్టణాల్లో 75 ప్రభుత్వ పాఠశాలలకుగాను మూడు పాఠశాలల్లో ఏకగ్రీవంగా కమిటీల ఎన్నికలు జరగ్గా మిగిలిన 72 పాఠశాలల్లో ఓటింగ్ ప్రక్రియలో ఎస్ఎంసీ కమిటీల ఎన్నికలు నిర్వహించామని ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య తెలిపారు.

జగ్గంపేటలో 41చోట్ల ఏకగ్రీవం

జగ్గంపేట, ఆగస్టు 8: మండలంలో 47 పాఠశాలల్లో జరిగిన విద్యాకమిటీ చైర్మన్ ఎన్నికలు 41 పాఠశాలల్లో ఏకగ్రీవంగా జరిగాయి. రెండు జడ్పీ ఉన్నత పాఠశాలలు, నాలుగు ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. మామిడాడ, జగ్గంపేట, మల్లిసాల, రామవరం పాఠశాలల్లో కూటమి నేతలు బలపరచిన విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికయ్యారని ఎంఈవో స్వామి తెలిపారు.

కొత్తపల్లిలో 66చోట్ల ఏకగ్రీవం

కొత్తపల్లి, ఆగస్టు 8: కొత్తపల్లి మండలంలో ఎస్ఎంసీల ఎన్నికలో 66 పాఠశాలలకు ఎన్నిక ఏకగ్రీవంగా కాగా, 3 పాఠశాలలకు ఎన్నిక నిర్వహించినట్టు ఎంఈవో వేణుగోపాల్ చెప్పారు. కొండెవరం పాఠశాలలో కూటమి సభ్యుల ఏకాభిప్రాయం కుదరకపోవడంతో శుక్రవారం ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కోనపాపపేట పాఠశాలకు ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్ఎంసీ ప్రతినిధులను కూటమి నాయకులు దుశ్శాలువా కప్పి సత్కరించారు.

గొల్లప్రోలులో...

గొల్లప్రోలు, ఆగస్టు 8: గొల్లప్రోలులో విద్యాకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా పంది శ్రీను, వైస్‌చైర్మన్‌గా అడ్డాల అర్థామణి ఎన్నిక కాగా జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల విద్యాకమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి.

గొల్లప్రోలు మండలంలో..

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 8: గొల్లప్రోలు మండలం చేబ్రోలు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌గా చల్లా ఆంజనేయులు, వైస్‌చైర్మన్‌గా బత్తుల శ్రీను ఎన్నిక కాగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికైన విద్యాకమిటీ ప్రతినిధులను టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అభినందించారు.

పిఠాపురం పట్టణంలో..

పిఠాపురం, ఆగస్టు 8: పిఠాపురం పట్టణంలో విద్యాకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా, ఏకగ్రీవంగా జరిగాయి. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌గా పల్లా లక్ష్మణరావు ఎన్నిక కాగా, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, టీడీపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్ అభినందించారు. కాగా పట్టణం, మండలంలో 80 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకుగాను 79 పాఠశాలల విద్యాకమిటీ ఎన్నికలు జరిగాయి. జగపతిరాజపురం పాఠశాల ఎన్నికలకు తల్లిదండ్రులు రాకపోవడంతో ఎన్నిక నిర్వహించలేదు.

పిఠాపురం మండలంలో..

పిఠాపురం రూరల్, ఆగస్టు 8: పిఠాపురం మండలంలోని గ్రామాల్లో విద్యాకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. దాదాపు అన్ని గ్రామాల్లోనూ టీడీపీ, జనసేన, బీజేపీ బలపరచిన విద్యాకమిటీ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని ఆయా పార్టీల నాయకులు అభినందించారు.

గండేపల్లిలో..

గండేపల్లి, ఆగస్టు 8: మండలంలోని 41 ప్రభుత్వ పాఠశాలలకు పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈవో నాయక్ తెలిపారు. మండలంలో అన్ని పాఠశాలల్లో 620మంది సభ్యులు ఎన్నికయ్యారన్నారు.

కరపలో..

కరప, ఆగస్టు 8: మండలంలో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణలు తెలిపారు. మండలవ్యాప్తంగా 50 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, ఒక గురుకుల, 9 జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. వాటిలో 27 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 3 హైస్కూళ్లలో ఎన్నికలు ఏకగ్రీవం కాగా, మిగిలిన పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించినట్టు తెలిపారు. ఎన్నికైన చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించిన అనంతరం అభినందనలు తెలిపి తొలి ఎస్ఎంసీ సమావేశాలను ఏర్పాటుచేసి వివిధ అంశాలపై చర్చించారు. ఎస్ఎస్ఏ ఏఎస్‌వో వి.రాంబాబు, కరప, గురజనాపల్లి, అరట్లకట్ట హైస్కూల్ హెచ్ఎంలు శ్రీనివాసరావు, సాయిమోహన్, వి.వెంకటశివగిరి, స్టాఫ్ సెక్రటరీ ప్రసాదరావు పాల్గొన్నారు.

కిర్లంపూడిలో..

కిర్లంపూడి, ఆగస్టు 8: మండలంలో 30 ప్రాథమిక పాఠశాలు, మూడు ప్రాథమికోన్నత పాఠశాలలు, 8 ఉన్నత పాఠశాలలు మొత్తం 42 పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ టి.జోసెఫ్ తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో 388మంది, ప్రభుత్వ పాఠశాలలో 72మంది, ఉన్నత పాఠశాలలో 47మంది సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఏలేశ్వరంలో..

ఏలేశ్వరం, ఆగస్టు 8: మండలంలోని విద్యాకమిటీల ఎన్నికలు ఎకగ్రీవంగా జరిగాయి. ఏలేశ్వరం పట్టణం, మండలం వ్యాప్తంగా 40 పాఠశాలల్లో కూటమి అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు, ఆగస్టు 8: మండలంలోని 47స్కూల్ కమిటీలకు గురువారం ఎన్నికలు నిర్వహించారు. వీటిలో 46 పాఠశాలలకు ఎన్నికలు ఏకగ్రీవం కాగా, భౌరువాక స్కూల్‌కు ఎన్నికలు నిర్వహించారు. ధర్మవరం ఎంపీపీఎస్2 పాఠశాల విద్యాకమిటీ ఎన్నిక వివాదాస్పదమైంది. ఈ పాఠశాల వద్ద కూటమి నాయకులు ఏకపక్షంగా విద్యాకమిటీని ఏర్పాటుచేశారని మాజీ విద్యాకమిటీ చైర్మన్ యాళ్ల రమేష్ ఆధ్వర్యంలో విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రత్తిపాడు,ధర్మవరం హై స్కూల్స్ విద్యాకమిటీ, మండలంలోని 9 హైస్కూల్స్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి.

తునిలో..

తుని రూరల్, ఆగస్టు 8: తుని పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల అభివృద్ధి కమిటీ నియామకం ప్రశాంతంగా జరిగింది. తుని పట్టణ, మండలంలో 91 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అన్నింటా పాఠశాల కమిటీలు కొలువు తీరాయి. ప్రతిచోట కమిటీల ఏకగ్రీవ ఎన్నిక జరిగింది.

రౌతులపూడిలో..

రౌతులపూడి, ఆగస్టు 8: మండలంలో 46 పాఠశాలలకుగాను 45 చోట్ల పాఠశాల కమిటీలు ఏకగ్రీవం ఎన్నిక కాగా పల్లపు చామవరంలో ఎన్నిక జరిగింది.

కోటనందూరులో..

కోటనందూరు, ఆగస్టు 8: పాఠశాలలో గురువారం జరిగిన విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 32 పాఠశాలలోను చైర్మన్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శంఖవరంలో..

శంఖవరం, ఆగస్టు 8: మండలంలోని 48 పాఠశాలల్లోను కూటమి అభ్యర్థులు ఎన్నికయ్యారు. 39చోట్ల ఏకగ్రీవం కాగా తొమ్మిదిచోట్ల ఎన్నికలు జరిగాయి.

పెద్దాపురంలో..

పెద్దాపురం, ఆగస్టు 8: ఎస్ఎంసీ ఎన్నికలు పట్టణ, మండల పరిధిలోని 79 పాఠశాలల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఈవోలు ఈ.ప్రభాకరశర్మ, వీఆర్కే చౌదరి ఎంపికైన నూతన ఎస్ఎంసీ కమిటీలను అభినందించారు.

తాళ్లరేవులో..

తాళ్లరేవు, ఆగస్టు 8: పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవోలు ఎ.మంగాయమ్మ, మోకా ఉమలు గురువారం తెలిపారు. మండలంలోని 79 ప్రాథమిక, జిల్లాపరిషత్ హైస్కూళ్లకుగాను 76 స్కూళ్లకు ఎన్నికలు సజావుగా సాగాయి. ఇందులో 59ప్రాథమిక పాఠశాలలు, 4 యూపీ స్కూల్స్, 13 జిల్లాప్రజాపరిషత్ హైస్కూల్స్ ఉన్నాయి. ఇందులో 46స్కూల్స్ ఏకగ్రీవం, 30స్కూల్స్‌కి ఎన్నికలు జరిగాయి. గాడిమొగ పంచాయతీ పెదవలసల స్కూల్లో చైర్మన్ ఎన్నికలో వైసీపీ, టీడీపీ గ్రూపుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో కోరింగ పోలీసులు చేరుకుని గ్రూపులను చెదరగొట్టారు. చైర్మన్ ఎన్నిక వాయిదా పడినట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు.

తొండంగిలో..

తొండంగి, ఆగస్టు 8: మండలంలో 64 పాఠశాలల్లో 58 పాఠశాలల్లో ఎన్నిక ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన ఆరు స్థానాల్లో స్నేహపూర్వక నామ మాత్రపు పోటీ జరగ్గా దానిలో కూడా విజయం సాధించారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 8: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలోని పలు ముంపు ప్రాంతాలను ఉదయం 5.30గంటల నుంచే నగరపాలక సంస్థ కమిషనర్ భావన గురువారం పర్యటించారు. లోతట్టు ప్రాంతాలు, రహదారులపై వర్షపునీరు లేకుండా చూడాలన్నారు. డ్రెయిన్ అవుట్‌లెట్స్ వరకు అన్నిచోట్ల శుభ్రం చేయాలని సూచించారు. కమిషనర్ వెంట ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన

కాకినాడ నగరం డెయిరీఫారం సెంటర్ సమీపంలోని పావురాల తూమునుంచి పల్లంరాజునగర్ 1వ వీధికి వెళ్లే దారిలో రాకపోకలు పునరుద్ధరించాలని ఇటీవల స్థానికులు కొందరు ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అర్జీ అందజేశారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని కమిషనర్ పరిశీలించి స్వయంగా సమస్యను క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.

అర్బన్ ఫారెస్టు ప్లాంటేషన్ నిర్వహణ స్థల పరిశీలన

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 8: అర్బన్ ఫారెస్టు ప్లాంటేషన్ కార్యక్రమ నిర్వహణకుగాను కాకినాడలోని పలు ప్రాంతాలను నగరపాలక కమిషనర్ భావన గురువారం పరిశీలించారు. ఈనెల 12నుంచి 15 మధ్య కాకినాడలో నిర్వహించబోయే అర్బన్ ప్లాంటేషన్ కార్యక్రమానికి సీఎం, డిప్యూటీ సీఎం హాజరుకానున్న నేపథ్యంలో స్థల పరిశీలన చేశారు. కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్ ఆవరణ, ఆర్ఆర్ నగర్‌లోని పార్క్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల గ్రౌండ్‌ను పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

జగ్గంపేట, ఆగస్టు 8: జగ్గంపేట, కాట్రావులపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం 11కేవీ ఫీడర్‌లో చెట్లు నరికివేత, లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు జగ్గంపేట ఏఈ కె.రత్నాలరావు తెలిపారు. పద్మనగర్, సత్యవేణిపేట, తోటవారివీధి, కొత్తవారివీధి, మెయిన్‌రోడ్డు, సీతానగరం, కాట్రావులపల్లి పరిధిలోని విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

కిర్లంపూడి మండలంలో..

కిర్లంపూడి, ఆగస్టు 8: మండలంలోని వీరవరం, తామరాడ, రామచంద్రపురం, గోనేడ, పాలెం, రాజుపాలెం, రామకృష్ణాపురం, ముక్కొల్లుల్లో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ కె.రత్నాలరావు తెలిపారు. వీరవరం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా అంతరాయం కలుగుతుందని తెలిపారు.

బస్సు ఢీకొని వృద్ధురాలికి తీవ్రగాయాలు

కరప, ఆగస్టు 8: కరపలో గురువారం ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెదపూడి మండలం శహపురం గ్రామానికి చెందిన బుద్దాల నూకరత్నం కరప బజార్‌సెంటర్‌లో రోడ్డుపక్కన నిలబడి బస్సు కోసం వేచిచూస్తోంది. అదే సమయంలో రామచంద్రపురంనుంచి కాకినాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఆమెను ఢీకొట్టింది. దీంతో రెండు కాళ్లు, చెయ్యి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను వెంటనే 108 అంబులెన్స్‌పై కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని బస్సుతో సహా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితురాలి కుమారుడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

పోర్టు చెక్‌పోస్టులో లారీల బారులు

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు 8: కాకినాడ పోర్టునుంచి రేషన్ బియ్యం అక్రమంగా విదేశాలకు తరలిపోతోందంటూ నూతనంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టువద్ద లారీలు బారులు దీరుతున్నాయి. ఈ చెక్‌పోస్టు ఇరుకుగా ఉండడంవల్ల తనిఖీలకు ఎక్కువగా సమయం పడుతుందని లారీల యాజమాన్యం అసహనం వ్యక్తం చేస్తోంది. ఖాళీగా ఉన్న ప్రదేశంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

గొల్లప్రోలు, ఆగస్టు 8: కేరళ వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం విరాళాల సేకరణ చేపట్టారు. గొల్లప్రోలు పట్టణంలో వివిధ వర్గాల ప్రజలనుంచి విరాళాలు సేకరించారు. సంఘం కాకినాడ జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కూరాకుల సింహాచలం, న్యాయవాది జీఎస్ భాస్కర్, ఏలేటి నానిబాబు పాల్గొన్నారు.

మండల్ కమిషన్ నివేదికవల్లే బీసీ రిజర్వేషన్లు

కాకినాడ సిటీ, ఆగస్టు 8: స్వాతంత్ర్యం తర్వాత 40ఏళ్ల తర్వాత మండల్ కమిషన్ నివేదిక వల్లే బీసీలకు రిజర్వేషన్లు లభించాయని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుత్తుల రమణ అన్నారు. మండల్ కమిషన్ రూపకర్త బిందేశ్వర్ ప్రసాద్ మండల్ నివేదిక సమర్పించిన రోజున నిర్వహించే మండల్‌డేను పురస్కరించుకుని సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీనాయకులు జోగారాజు, కాలా వెంకట్, టేకుమూడి శ్రీను, మట్టపర్తి రమణ, పితాని సురేష్, ముత్యాల అనిల్‌కుమార్, రాయుడు బాబ్జి, పెంకే బాలు, రామసురేష్ పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ మూసివేయొద్దంటూ నిరసన

పెద్దాపురం, ఆగస్టు 8: మండలంలోని కట్టమూరులో రాయన్న చెరువు సమీపంలో ఉన్న ఆర్వో వాటర్‌ప్లాంట్‌ను మూసివేయొద్దంటూ టీడీపీ నేతలు గురువారం నిరసన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వీరబ్రహ్మానికి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో తాగునీటికి ఇబ్బంది ఉందని, పంచాయతీ ద్వారా నీరు సక్రమంగా ప్రజలకు సరిపడా అందడం లేదని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మేడిది శ్రీనివాస్, సానిపిన రామకృష్ణ, ఏలేటి సత్తిబాబు, సుబ్బారావు, అడపా గంగాధరం పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌లో అన్నదానం

పిఠాపురం, ఆగస్టు 8: పేదవారు అన్నపానీయాలు కోసం ఇబ్బంది పడకూడదనేది టీడీపీ, సీఎం చంద్రబాబు లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. వర్మాస్ కావ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిఠాపురం పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో ప్రతి గురువారం నిర్వహిస్తున్న అన్నక్యాంటీన్‌లో ఆయన ప్రజలకు భోజనాలు వడ్డించారు. వారితో కలిసి అక్కడే భోజనం చేశారు. మార్కెట్‌కు వచ్చే ప్రజలు భోజనం కోసం ఇబ్బంది పడకూడదని అన్నక్యాంటీన్ నిర్వహిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో ఈనెల 15న ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న అన్నక్యాంటీన్ తిరిగి ప్రారంభమవుతుందని చెప్పారు. దీనివల్ల మార్కెట్‌సెంటర్‌లో గురువారం అన్నక్యాంటీన్ ఇకపై నిర్వహించమని తెలిపారు. రూ.5కే భోజనం, టిఫిన్ అందిస్తున్నట్లు చెప్పారు.

కాలువలోకి దూసుకుపోయిన ట్రాక్టర్

గొల్లప్రోలు, ఆగస్టు 8: గొల్లప్రోలు పట్టణ శివారు జగనన్న కాలనీకి తాగునీటి సరఫరా చేసే ట్యాంకర్‌కు పెనుప్రమాదం తప్పింది. ట్యాంకర్ ద్వారా తాగునీటిని తీసుకువెళ్లి సుద్దగడ్డ వరద నీటిలో వస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పింది. పక్కనే ఉన్న కాలువలోకి దూసుకుపోయింది. డ్రైవర్, సహాయకుడు కిందకు దూకి బయటకు వచ్చారు. అనంతరం ట్యాంకర్‌ను స్థానికుల సహాయంతో బయటకు లాగారు.

విద్యార్థిని అదృశ్యం

గొల్లప్రోలు, ఆగస్టు 8: గొల్లప్రోలుకు చెందిన యువతి అదృశ్యమైంది. పట్టణంలోని గంటావారిగొయ్యి ప్రాంతానికి చెందిన యువతి కాకినాడలోని పీఎస్‌లక్ష్మి డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనల్‌ఇయర్ చదువుతోంది. బుధవారంఉదయం తాను గొల్లప్రోలు బస్టాండులో బస్సు ఎక్కించగా రాత్రి ఇంటికి తిరిగి రాలేదని విద్యార్థిని తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. చుట్టుపక్కల వెతికినా కనిపించలేదని తెలిపారు. ఒక యువకుడిపై అనుమానంగా ఉందన్నారు. విద్యార్థిని అదృశ్యంపై గొల్లప్రోలు పోలీసులు కేసునమోదు చేశారు.

'వ్యాయామం చేయాలి'

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 8: శారీరక ఆరోగ్యం కోసం తప్పనిసరిగా వ్యాయామం చేయాలని జీజీహెచ్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి కోరారు. జాతీయ ఎముకల నివారణా వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆస్పత్రి ప్రాంగణంలో ఆర్థోపెడిక్ వైద్యవిద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ విఠల్, ఆర్ఎంవో డాక్టర్ అనిత, ఫిజియోథెరపి హెచ్‌వోడీ డాక్టర్ సాయినాథ్ పాల్గొన్నారు.

గర్భిణులకు శ్రీమంతాలు

తాళ్లరేవు, ఆగస్టు 8: సుంకరపాలెం-3 అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను గురువారం నిర్వహించారు. సూపర్‌వైజర్ మాణిక్యాంబ గర్భిణులకు సామూహిక శ్రీమంతం చేశారు.

అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ

పెద్దాపురం, ఆగస్టు 8: మండలంలోని ఆర్‌బీ కొత్తూరులో అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పెద్దాపురం నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఈ విగ్రహాలను ఆవిష్కరించారు. పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, యెండ్రు సత్తిబాబు, గోలి సూర్యనారాయణ, బొబ్బరాడ సత్తిబాబు, ఊబా జాన్ మోజెస్ పాల్గొన్నారు.

భట్టాచార్య మృతి తీరనిలోటు

కాకినాడ సిటీ, ఆగస్టు 8: సీపీఎం అగ్రనేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి తీరని లోటని సీపీఎం కాకినాడ జిల్లా కమిటీ సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం సుందరయ్య భవన్‌లో జరిగిన సంతాపసభలో భట్టాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీనికి కె.వీరబాబు అధ్యక్షత వహించారు. సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, పార్టీ నాయకులు కేఎస్ శ్రీనివాస్, కె.సింహాచలం, ఎం.విజయకుమార్, టి.రాజా, వి.చంద్రరావు పాల్గొన్నారు.

'యనమల చొరవతో సర్వతోముఖాభివృద్ధి'

తుని రూరల్, ఆగస్టు 8: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య చొరవతో తుని సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు స్పష్టం చేశారు. తునికి ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే తుని పారిశ్రామికంగా అభివృద్ధికి అడుగులు పడుతున్న వేళ ప్రభుత్వం చొరవ తీసుకుని ఎయిర్‌స్ట్రిప్‌కు ముందుకు రావడం తమ ప్రాంతప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

భారీ వర్షాలకు నీటమునిగిన వరి పంట

తొండంగి, ఆగస్టు 8: భారీవర్షాల కారణంగా మండలంలోని పలుగ్రామాల్లో వరిపంట నీట మునిగింది. కొమ్మనాపల్లిలో 300 ఎకరాల్లో వరిపంట పూర్తిగా నీట మునిగి చెరువును తలపిస్తోంది. ఉప్పుచెరువు నుంచి నీరు దిగువకు పోయే మార్గం వద్ద నీటి నిల్వకోసం ఎత్తు చేయడంవల్ల నీరు వేగంగా దిగువకు పోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఎ.కొత్తపల్లి ఆవలో కూడా వరిపొలాలు భారీగా నీట మునిగాయి.

జగనన్న కాలనీవాసుల రాకపోకలకు పడవలు

గొల్లప్రోలు, ఆగస్టు 8: గొల్లప్రోలు పట్టణ శివారులోని జగనన్న కాలనీకి సుద్దగడ్డ వరద నీటిలో రాకపోకలు సాగించేందుకు వీలుగా పడవలు ఏర్పాటు చేయాలని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. సుద్దగడ్డ వరద ఉధృతి కారణంగా రాకపోకలు నిలిచిపోయి జగనన్న కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారు గురువారం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. రేషన్‌సరుకులతోపాటు కాలనీవాసులకు తాగునీటిని సరఫరా చేయాలని చెప్పారు. ఆర్డీవో వెంట నగరపంచాయతీ కమిషనరు రవికుమార్, ఇన్‌చార్జి తహసీల్దారు మస్తానా ఉన్నారు.

పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 8: అధిక వర్షాలు, వరదలు కారణంగా పంటలకు అధిక నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణలు తెలిపారు. గొల్లప్రోలు మండలం లక్ష్మీపురం, చెందుర్తి, తాటిపర్తి గ్రామాల్లో వారు గురువారం పర్యటించి ముంపునకు గురైన పంటపొలాలును పరిశీలించారు.

పంపాజలాశయంనుంచి సముద్రంలోకి నీరు విడుదల

అన్నవరం, ఆగస్టు 8: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి పంపా రిజర్వాయర్‌కు వర్షపు నీరు కొండలమీదుగా రిజర్వాయర్‌కు చేరుతుండడంతో రిజర్వాయర్ నీటిమట్టం 100.2 అడుగులకు చేరింది. ముందుజాగ్రత్త చర్యగా రిజర్వాయర్‌నుంచి వరదగేటు ద్వారా 100 క్యూసెక్కులు, పంటకాలువ ద్వారా 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

నీట మునిగిన వరి పంటలు పరిశీలన

జగ్గంపేట, ఆగస్టు 8: జగ్గంపేటలో నీట మునిగిన వరి పొలాలను అగ్రికల్చర్ అధికారి ఎడ్ల శ్రీరామ్ పరిశీలించారు. వర్షాలకు జగ్గంపేట మండలం చెరువులు నిండి మల్లిపాక, గొల్లలగుంట, రామవరంల్లో 70ఎకరాల్లో వరి పంట నీట మునిగింది.

గండేపల్లి, ఆగస్టు 8: వర్షాలకు మండలంలో మురారి, గండేపల్లిలోని పలు పల్లపు ప్రాంతాల్లో వరిసాగు నాట్లు పూర్తిగా నీటమునిగి చెరువును తలపిస్తున్నాయి. వర్షాలకు చెరువులన్నీ



పంపా రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

నిండుకుండలుగా మారాయి. నీలాద్రిరావుపేట గ్రామ పరిధిలోని రామభద్రయ్యచెరువు పొంగి పొర్లి వరదనీరు జడ్.రాగంపేట ఎస్సీపేట కాలనీని ఒక్కసారిగా ముంచెత్తడంతో వరద నీటితో నిండిపోయింది.

200ఎకరాల్లో వరినాట్లు మునక

కొత్తపల్లి, ఆగస్టు 8: భారీ వర్షాల కారణంగా ఎగువనుంచి కాలువల ద్వారా కిందికి విడుదల చేస్తున్న వరద నీటికి మండలంలో 200ఎకరాల్లో వరినాట్లు నీట మునిగినట్టు మండల వ్యవసాయాధికారి వట్టి జోగిరాజు తెలిపారు. కొమరగిరి, గోర్స, కొండెవరం, నాగులాపల్లి, వాకతిప్ప గ్రామాల్లో నాట్లు నీటిలో మునిగాయన్నారు. చేలల్లో చేరిన నీరంతా కిందికి పారేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

'మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి'

ప్రత్తిపాడు, ఆగస్టు 8: జిల్లాలోని పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, మెనూ ప్రకారం ఆహార పదార్థాల తయారీ క్రమపద్ధతిలో నిర్వహించాలని జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో చామంతి నాగేశ్వరరావు తెలిపారు. మండల విద్యాశాఖ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకం రికార్డులు పరిశీలించారు. అనంతరం మండల విద్యాశాఖకు చెందిన సీఆర్పీ ఎలిపే రాంజీ ప్రసాద్ సీఆర్పీల రాష్ట్ర సంఘ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల సీఎంవో నాగేశ్వరరావు ప్రసాద్‌ను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు వి.రాజబాబు, వై.అచ్చిరాజు పాల్గొన్నారు.

'విద్యార్థి దశనుంచే పరివర్తనకు శిక్షణ పొందాలి'

జేఎన్టీయూకే, ఆగస్టు 8: వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో మొదటి సంవత్సర బీటెక్, మెడికల్ విద్యార్థులకు శ్రేష్ఠతకోసం లక్ష్యాన్నినిర్దేశించడం, పరివర్తన చెందేందుకు శిక్షణ అనే అంశంపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి పీఈ విభాగాధిపతి డాక్టర్ కె.కృష్ణభాస్కర్ సమన్వయకర్తగా వ్యవహరించగా ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగాను, విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి ఎం.రామప్రసాద్ విశిష్ట అతిథిగాను, రెక్టార్ కేవీరమణ, యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు, వైస్‌ప్రిన్సిపాల్ మీరాసాహెబ్ గౌరవఅతిథులుగాను పాల్గొన్నారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పరివర్తన చెందేందుకు శిక్షణ పొందాలన్నారు. అనంతరం ఏపీ ఫారెస్ట్ అకాడమీ మాజీ డైరెక్టర్ జనరల్ ఎం.రామప్రసాద్ మాట్లాడుతూ సానుకూలమనస్తత్వంతో ముందుకు వెళ్తే విజయం దానంతటదే చేరువవుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

'నూతన క్రిమినల్ చట్టాలు రద్దు చేయాలి'

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 8: నూతన క్రిమినల్ చట్టాలతో జ్యుడిషియల్‌కి అధికారులు తగ్గించి పోలీసులకు అధికారాలు అప్పచెప్పడం ప్రజల హక్కులను హరించడమేనని సీనియర్ న్యాయవాది మహ్మద్ జవహర్ ఆలీ అన్నారు. గురువారం కాకినాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూక్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ నగర అధ్యక్షులు పి.రామచంద్రరాజు, బార్ అసోసియేషన్ సభ్యులు కుంచే శ్రీహరి, వారా రాజబాబు, నాగజ్యోతి, అల్తాఫ్, దేవీ, శివ, శైలజ, రాజుబాబు, సుంకర శ్రీనివాస్, ఉమా గౌరి, శ్రీలక్ష్మి, వీరలక్ష్మి, శైలజ పాల్గొన్నారు.

కోరింగలో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

తాళ్లరేవు, ఆగస్టు 8: కోరింగ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ విక్రాంత్ పాటిల్ తనిఖీ చేశారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో అన్నిరూములను పరిశీలించి కేసులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కోరింగ ఎస్ఐ సత్యనారాయణలతో స్టేషన్‌కు సంబంధించిన విషయాలను చర్చించారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డీలర్లు

ప్రత్తిపాడు, ఆగస్టు 8: ప్రత్తిపాడులో చంద్రబాబు చిత్రపటానికి మండల రేషన్ డీలర్లు పాలాభిషేకం నిర్వహించారు. లయన్స్ కమిటీ హాలు వద్ద గురువారం మండల రేషన్‌డీలర్లు సమావేశమయ్యారు. ప్రజా పంపిణీ వ్యవస్థను పాతపద్ధతిలో కొనసాగించడానికి నిర్ణయించడంపట్ల సీఎం చంద్రబాబుకు సమావేశం ఏకగ్రీవంగా కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానించింది. అనంతరం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు ఏపూరి తిరపతయ్య, నాయకులు కొట్నం రాజా, తటవర్తి సందీప్, కొప్పన వెంకట నాయుడు, కె.సత్యనారాయణ, సిద్ధపురెడ్డి నాగభూషణం, గొర్ల వీర సాంబమూర్తి పాల్గొన్నారు.

'రైస్‌మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా'



బాబీని గజమాలతో అభినందిస్తున్న దృశ్యం

కరప, ఆగస్టు 8: రైస్‌మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని కాకినాడ ఏరియా రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ నూతన అధ్యక్షుడు మేదరమాటి వెంకన్నచౌదరి(బాబి) తెలిపారు. కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో గురువారం కాకినాడ ఏరియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. సంఘ అధ్యక్షుడిగా వెంకన్నచౌదరి, ఉపాధ్యక్షుడిగా కొండపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శిగా పాతూరి శ్రీహరిచౌదరి, కోశాధికారిగా పెద్దిరెడ్డి రామానుజయ్య(బాబ్జి), సంయుక్త కార్యదర్శిగా ఆకెళ్ల శ్రీనివాస నాగేశ్వరరావులు ప్రమాణం చేసి మాట్లాడారు. దీనికి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కార్యవర్గాన్ని ఎమ్మెల్యేతోపాటు మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్తిబాబు, రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు నున్న రామకృష్ణ, ఆలిండియా రైస్‌ఎక్స్‌పోర్ట్ అసోషియేషన్ అధ్యక్షుడు బీవీ కృష్ణారావు, ఆర్ఎంపి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి అభినందించారు.

దివ్యాంగుల ఉపకరణాలకు ప్రత్యేక శిబిరం

సర్పవరం జంక్షన్, ఆగస్టు 8: జిల్లా విభిన్న ప్రతిభావంతుల, ట్రాన్స్‌జెండర్, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లా ఏడీ పి.నారాయణమూర్తి ఆధ్వర్యంలో గురువారం రమణయ్యపేట మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన దివ్యాంగులకు ఉపకరణాల గుర్తింపు ప్రత్యేక శిబిరానికి దివ్యాంగులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాల మేరకు జిల్లాఅంతటా ఈ ప్రత్యేక గుర్తింపు శిబిరాలను ఈనెల 2 నుంచి 9 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీవో రమేష్‌నాయుడు, జనసేన నాయకులు కరెడ్ల గోవిందు, మాదారపు తాతాజీ, బత్తుల దొరబాబు, చోడిశెట్టి ఇంద్ర, వెంకటరమణ, కుడుపూడి బాలాజీ, రాయుడు అనిల్ పాల్గొన్నారు.

వాకలపూడి డీడీఆర్‌సీ సెంటర్‌లో ఉమామనోవికాస కేంద్రం సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి ఆధ్వర్యంలో కోల్‌కత్తాకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ లోకోమోటర్ డిజేబిలిటీస్‌ల సహకారంతో రూ.21.50 లక్షల విలువగల 86 బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్స్, కృత్రిమ పరికరాలను దివ్యాంగులకు గురువారం పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విభిన్నప్రతిభావంతులశాఖ ఏడీ పి.నారాయణమూర్తితోపాటు లోకోమోటార్ సంస్థ ప్రతినిధులు అభిమన్యు, కేఆర్ సింగ్, ఆక్కు, ఫిజియోథెరపిస్టులు అర్ఘనంది, అరూన్, కేఆర్ గోస్ట్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే నల్లమిల్లి

కాకినాడ సిటీ, ఆగస్టు 8: పెదపూడి మండలంలోని సమస్యలు పరిష్కరించేదిశగా చర్యలు తీసుకోవాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. పెదపూడి ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మండలంలోని సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజముద్రతో రైతులకు పాస్ పుస్తకాలు త్వరితగతిన అందేలా అధికారులు దృష్టిసారించాలన్నారు. అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'బీఎస్ఎన్ఎల్ సేవలపై ఉద్యోగుల అవగాహన ర్యాలీ'



కాకినాడ సిటీ, ఆగస్టు 8: బీఎస్ఎన్ఎల్ సేవలపై ఉద్యోగులు గురువారం కాకినాడలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బీఎస్ఎన్ఎల్ ఆఫీసు నుంచి కల్పన సెంటర్, సినిమారోడ్, వైఎస్ఆర్ బ్రిడ్జి, ఎస్పీ ఆఫీస్, సర్పవరం జంక్షన్, భానుగుడి సెంటర్, మెయిన్‌రోడ్ మీదుగా తిరిగి కార్యాలయానికి చేరింది. అధికారులు, ఉద్యోగులు ప్లేకార్డులు పట్టుకుని బీఎస్ఎన్ఎల్ సేవలపై ప్రచారం సాగించారు. రాజమహేంద్రవరం బిజినెస్ ఏరియా ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు, డీజీఎంలు రాజశేఖరబాబు, సీహెచ్‌వీ సత్యనారాయణ, సైదా నాయక్, ఐఎఫ్ఏ నాగరాజు డీఈ ఈశ్వర్ పాల్గొన్నారు.

యువతిపై అత్యాచారయత్నం

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 8: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో యువతిపై అత్యాచార యత్నం జరిగింది. చేబ్రోలు ఎస్సీ కాలనీకి చెందిన యువతి(22) స్థానికంగా ఉన్న దుకాణంలో పనిచేస్తోంది. ఆమె గురువారం అస్వస్థతగా ఉండడంతో ఇంటి వద్దే ఉండిపోయింది. ఇంటి పక్కనే ఉండే జి.నాగేశ్వరరావు అనే వ్యక్తి వచ్చి బలాత్కారం చేయబోయాడు. అడ్డుకోబోయిన మేనమామ భార్య, తన తల్లిని కొట్టినట్లు యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జాన్‌బాషా తెలిపారు.